సాక్షి
నిజామాబాద్
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



ధాన్య భాండాగారం..

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశానికే ధాన్య భాండాగారంగా నిలిచిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸



కాలువ ఇలా..

వేల్పూర్ మండలంలోని పడగల్ నవాబు చెరువు ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువలో పూడిక, పిచ్చిమొక్కలు పెరిగాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.7 /21.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్థలం పరిశీలన



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. రూరల్ తహసీల్, ఎంపీడీవో, ఇరిగేషన్, ఎస్సారెస్పీ భూనిర్వాసితుల రెవెన్యూ కార్యాలయ భవనాలను కూల్చి వేసి చదును చేసిన స్థలాన్ని నుడా చైర్మన్ కేశ వేణు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీవో, నార్త్, సౌత్ తహసీల్దార్లతోపాటు రూరల్ సర్వేయర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడే ప్రెస్ క్లబ్ వద్ద ఉన్న జర్నలిస్టులతో కాసేపు ముచ్చటించారు. తమకు తగిన స్థలం కేటాయించాలని పలువురు జర్నలిస్టులు కోరగా, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలంగాణ కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, అంతిరెడ్డి దేవేందర్ ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధి నిధుల విడుదల

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పనులకు సంబంధించి అభివృద్ధి నిధులు విడుదలైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 21 పాఠశాలలకు పాఠశాల విద్యాప్రోగ్రాం కింద నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. టాయిలెట్లను శుభ్రపరచడం, మొక్కల పెంపకం, పాఠశాల ఆవరణను శుభ్రత, స్కావెంజర్లను నియమించేందుకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.కోటీ 96 లక్షల 17వేలు మూడు నెలలకు విడుదల చేసినట్లు డీఈవో తెలిపారు. వీటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్‌లో జమచేయడం జరిగిందని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ టారిఫ్‌పై బహిరంగ విచారణ

సుభాష్‌నగర్: విద్యుత్ టారిఫ్‌పై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రతిపాదనల మేరకు ఈనెల 24న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలపై బహిరంగ విచారణ ఉంటుందన్నారు. విచారణకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. ఆసక్తి గల విద్యుత్ వినియోగదారులు బహిరంగ విచారణకు హాజరు కావాలని వరుణ్‌రెడ్డి కోరారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సస్పెన్షన్

ఖలీల్‌వాడి: టాస్క్ ఫోర్స్ ఏసీపీగా గతంలో పనిచేసిన విష్ణుమూర్తిని సస్పెండ్ చేస్తూ డీజీపీ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. విష్ణుమూర్తిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఇదివరకు సీపీగా పని చేసిన కల్మేశ్వర్ విచారణ చేపట్టి డీజీపీకి నివేదిక అందజేశారు. 11న ఏసీపీని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. విచారణ అనంతరం ఏసీపీపై వేటు పడింది. ఏడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా పని చేసిన విష్ణుమూర్తి ఏడాది క్రితం డిప్యూటేషన్‌పై టాస్క్‌ఫోర్స్‌కు వచ్చారు.

ఎర్రజొన్న, పసుపు పంటల గిట్టుబాటు ధర కోసం రైతుల్లో చర్చ ప్రారంభమైంది. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్మూర్ ప్రాంత రైతాంగం ప్రతి ఏడాది రోడ్లపైకి రావాల్సి వస్తోంది. 2019లో జేఏసీ ఆధ్వర్యంలో రైతులు ఉద్యమించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కల్వకుంట్ల కవితపై 178 మంది రైతులను పోటీకి నిలిపి దేశవ్యాప్త చర్చకు తెర తీశారు. రైతు ఉద్యమాన్ని ముందుండి నడిపిన అధికార పార్టీకి చెందిన అన్వేష్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ఏ మేరకు ఒప్పిస్తాడోనని ఆయనపై రైతాంగం వేచి చూస్తోంది.

2019 ఫిబ్రవరిలో ఆర్మూర్‌లోని జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఎర్రజొన్న, పసుపు రైతులు



ఉద్యమ లక్ష్యం నెరవేరేనా?

- ఓ వైపు ఎర్రజొన్న రైతులతో వ్యాపారుల ఒప్పందాలు..
- మరో వైపు చేతికొస్తున్న పసుపు పంట
- గిట్టుబాటు ధర కోసం పోరాడుతూనే ఉన్న రైతులు
- ఇప్పటికీ నిర్దిష్టమైన మార్కెటింగ్, విత్తన విధానం లేదు
- ఇప్పుడు ఆశలన్నీ రైతు ఉద్యమాన్ని నడిపిన అన్వేష్‌రెడ్డిపైనే..

ఆర్మూర్: ఎర్రజొన్న, పసుపు రైతుల ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆర్మూర్ గడ్డపై పంట దిగుబడికి గిట్టుబాటు ధర, కొనుగోళ్లపై మళ్లీ చర్చ మొదలైంది. ఓ వైపు ఎర్రజొన్న వ్యాపారులు రైతులతో ఒప్పంద పత్రాలు రాసుకుంటుండగా, మరో వైపు పసుపు పంట చేతికొచ్చేస్తోంది. ఎర్రజొన్న, పసుపునకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని 2019లో జేఏసీ ఆధ్వర్యంలో రైతులు ఉద్యమించారు. ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ముట్టడి, అసెంబ్లీకి పాదయాత్ర, ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యమాన్ని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు వి ప్రభాకర్, అన్వేష్‌రెడ్డి, దేగాం యాదాగౌడ్, మంథని పిట్టి గంగారాం, జక్క లింగారెడ్డి, మహేందర్ తదితరులు ముందుండి నడిపించారు. ఆనాటి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కల్వకుంట్ల కవితపై 178 మంది రైతులను పోటీకి నిలిపి దేశవ్యాప్త చర్చకు తెరలేపారు.



2019 ఫిబ్రవరిలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి, జేఏసీ నాయకులు

● రైతుల ఉద్యమ నేపథ్యం

ఎర్రజొన్న, పసుపు పంటలకు గిట్టుబాటు కోసం ఆర్మూర్ ప్రాంత రైతాంగం ప్రతి ఏడాది పచ్చని పంటపొలాలను వదిలి రోడ్లపైకి రావాల్సి వస్తోంది. 15 ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా నిర్దిష్టమైన మార్కెటింగ్, విత్తన విధానాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రైతుబంధు పథకం ద్వారా ఇస్తున్న పెట్టుబడి సాయానికి బదులుగా గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్యమబాట పట్టారు. పసుపునకు రూ.15వేలు, ఎర్రజొన్నకు రూ.3,500 గిట్టుబాటు కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, దళారుల మోసాలకు చెక్ పెట్టాని రైతులు ఉద్యమబాట పట్టారు.

జేఏసీ నాయకుడే ప్రభుత్వంలో ముఖ్యుడు..

నాటి ఉద్యమంలో రైతులను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి సమీకరించడం, ఉద్యమ ప్రణాళిక రూపొందించడం, ఉద్యమ సమయంలో అధికారులతో చర్చల్లో వేల్పూర్ మండలం జాన్కంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్వేష్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. ఈ తరుణంలో అందరి దృష్టి రైతు ఐక్య కార్యాచరణ కమిటీలో కీలకంగా వ్యవహరించిన ఆయనపైనే పడింది. అధికార పార్టీకి చెందిన అన్వేష్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యుల వద్దకు నేరుగా వెళ్లే అవకాశం కలిగి ఉన్న ఆయన.. ఎర్రజొన్న, పసుపు పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏ మేరకు ఒప్పిస్తాడోనని రైతాంగం ఆశతో ఉంది.

పోరాట స్ఫూర్తితో రైతుల పక్షాన ఉండాలి



ఎర్రజొన్న, పసుపు రైతుల సమస్యలు పరిష్కరించడంలో అన్వేష్‌రెడ్డి పోరాట స్ఫూర్తితోనే ముందుకు సాగాలి. రైతు జేఏసీ నాయకులను ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి గిట్టుబాటు ధర ఇప్పించాలి. లేని పక్షంలో రైతు ఉద్యమాల్లో భాగంగా ఆయనను సైతం నిలదీసి రైతుల లక్ష్యాన్ని సాధించుకుంటాం.

– వి ప్రభాకర్, రైతు జేఏసీ నాయకుడు, ఆర్మూర్

రైతు ఉద్యమంతోనే పదవి



రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేసిన ఉద్యమాల ద్వారానే అన్వేష్‌రెడ్డికి పార్టీలో వచ్చిన గుర్తింపుతో రాష్ట్ర స్థాయి పదవి వచ్చింది. ఈ అవకాశాన్ని రైతాంగ సమస్యల పరిష్కారానికి వినియోగించాలి. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఎర్రజొన్న, పసుపు పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించాలి.

– దేగాం యాదాగౌడ్, జేఏసీ నాయకుడు, ఆర్మూర్

తెయూ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ యాదగిరి రావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ టీ యాదగిరిరావు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే విశేషమైన అనుభవం ఉన్న ఆచార్యులను మాత్రమే యూనివర్సిటీలకు వీసీలుగా నియమిస్తున్నామన్నారు. యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తెయూను రాష్ట్రంలోనే మోడల్ వర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వీసీకి సూచించారు. యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు

సరైన ప్రణాళికలతో వస్తే నిధులు మంజూరు చేసి అన్ని విధాలుగా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన వీసీ



రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను వీసీ టి యాదగిరి రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుంది



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ

ఎడపల్లి (బోధన్): క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుందని ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ అన్నారు. స్టైఫండరీ కేడెట్ ట్రెయినీ కానిస్టేబుళ్లకు 9 నెలల శిక్షణ కాలంలో భాగంగా మండలంలోని జానకంపేట శివారులో ఉన్న నిజామాబాద్ కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో స్పోర్ట్స్ మీట్‌– 2024ను సింధుశర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనే పోలీసులకు క్రీడల ద్వారా ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రస్తుతం సీటీసీలో శిక్షణ పొందుతున్న వారిలో ఎంతో మంది మంచి క్రీడాకారులు ఉన్నారని, తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. సైబరాబాద్ నుంచి వచ్చిన 250 మంది ట్రెయినింగ్ తీసుకుంటున్నారన్నారు. సీటీసీ ప్రిన్సిపాల్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గెలుపు కోసం పోరాడుతూనే, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా పోటీలతో క్రమశిక్షణ, పనిలో అంకితాభావం, సక్సెస్ కోసం చేసే కృషి పెరుగుతుందన్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ కొనసాగుతుందన్నారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ జి బస్వారెడ్డి, సీటీసీ ఏసీపీ (వైస్ ప్రిన్సిపాల్) మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్ శ్రీనివాస్‌రావు, ఏఆర్ ఏసీపీ నాగయ్య, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ శివరాం, ఆర్ఐ శ్రీపాల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్

ఏఈవోలకు ఎదురుదెబ్బ

- జిల్లాలో నలుగురిపై సస్పెన్షన్ వేటు
- డిజిటల్ క్రాప్ సర్వే చేయకపోవడమే కారణం!
- మెమోలిచ్చినా మారకపోవడంతో చర్యలకు దిగిన రాష్ట్ర ప్రభుత్వం

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు (ఏఈవోలకు) ఎదురుదెబ్బ తగిలింది. డిజిటల్ క్రాప్ సర్వే చేయనివారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. జిల్లాలో నలుగురు ఏఈవోలను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలూర్ క్లస్టర్ వసుధామ్, ఎడపల్లి క్లస్టర్ జ్యోతి, గుండారం క్లస్టర్ రాకేశ్, ఆర్మూర్ క్లస్టర్ సవిత సస్పెన్షన్‌కు గురయ్యారు.

దీంతో జిల్లాలోని మిగతా ఏఈవోలకు కూడా సస్పెన్షన్ గుబులు పట్టుకుంది. వాస్తవంగా డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో ప్రభుత్వానికి సహకరించకపోవడంతోనే ఏఈవోలను సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. ఈ విషయాన్ని సూటిగా చెప్పకుండా రైతు బీమా వివరాల నమోదులో నిర్లక్ష్యం చేశారని ఉత్తర్వుల్లో కారణంగా చూపింది. పంటల వివరాలు సేకరణ సులభమయ్యే డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈవోలు వ్యతిరేకించడంతోనే రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఏఈవోలు దిగిరాకపోతే సస్పెన్షన్‌ను నలుగురికి పరిమితం చేయకుండా మరికొందరి జాబితాను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 107మంది ఏఈ వోలు పని చేస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల మేరకు జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వేను చేపట్టడం లేదు. ఏఈవోలతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి సర్వే పూర్తి చేయాలని ఏడీఏలు, మండల ఏవోలపై ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం జిల్లాలోని రెంజల్ మండల ఏవో తన పరిధిలోని పని చేస్తున్న ఏఈవోలకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం కూడా ఇటీవల జిల్లాలోని 107మందికి మెమోలు జారీ చేసి హెచ్చరించింది. తీరు మార్చుకోకపోవడంతో పరోక్షంగా సస్పెన్షన్ చర్యలకు దిగింది. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందనుకునే సమయంలో ఎదురుదెబ్బ తగలడంతో ఏఈవోలు సందిగ్ధంలో పడ్డారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏఈవోలు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

గడుగు గంగాధర్ అసంతృప్తి

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- తన స్థాయికి తగిన పదవి కాదంటూ అలక
- ఏళ్లతరబడి పనిచేస్తే అన్యాయం చేశారంటూ ఆవేదన



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండే కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి స్వరాలు గట్టిగానే బయటకు వస్తున్నాయి. తాజాగా అధికార కాంగ్రెస్‌లో పదవుల పంపకాల్లో అలకల పర్వం మరింత రాజుకుంటోంది. అసంతుష్ట నేతలు మెల్లగా బయటకు వస్తున్నారు. తాజాగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియామకమైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ తనకు కేటాయించిన పదవిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లతరబడి పార్టీ కోసం కష్టపడిన తనకు కేటాయించిన పదవి స్థాయికి తగినట్లుగా లేదంటున్నారు. ఎన్‌ఎస్‌యూఐ నుంచి మొదలై కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తనకు తగిన ప్రాధాన్యత కల్పించలేదంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. తొమ్మిదేళ్లపాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన గడుగు గంగాధర్ ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఇలాంటి నేపథ్యంలో తనకు ప్రస్తుతం కేటాయించిన పదవి వద్దంటూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ పదవితో పార్టీకి దూరం కావాల్సిన పరిస్థితి ఉందని, ఈ క్రమంలో పార్టీ కార్యకర్తగానే ఉంటానని చెప్పినట్లు సమాచారం. గడుగు పదవిని తిరస్కరించిన నేపథ్యంలో పార్టీ శ్రేణులు తదుపరి పరిణామాలపై ఆసక్తిగా చూస్తున్నారు. గతంలో గడుగుకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చినట్లే వచ్చి చేజారింది. ఇదిలా ఉండగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అయిన తాటిపర్తి జీవన్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో ఉండాల్సిన అవసరమేముందని, తన అనుచరుడి హత్య నేపథ్యంలో వ్యాఖ్యానించడం గమనార్హం. పార్టీలో మరిన్ని అసమ్మతి స్వరాలు బయటకు రానున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పోలీసు కేటుగాడు!

- బంగారం ఆశ చూపి డబ్బులు వసూలు
- ఓ వ్యక్తికి రూ.17 లక్షల టోకరా వేసిన డీఎస్పీ
- సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

కామారెడ్డి క్రైం: ఎవరైనా మోసం చేస్తే న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తాం. అయితే బాధితులకు అండగా ఉండి న్యాయం చేయాల్సిన పోలీసు అధికారే దొంగ బంగారం పేరిట డబ్బులు కాజేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో చర్చనీయాంశమైంది. వివరాలిలా ఉన్నాయి. గతంలో వరంగల్ జిల్లాలో పనిచేసిన డీఎస్పీ మదన్‌లాల్ ఏడు నెలల క్రితం కామారెడ్డి డీసీఆర్‌బీ విభాగానికి బదిలీపై వచ్చాడు. జిల్లా పోలీస్ కార్యాలయానికి సమీపంలోని ఓ కాలనీలో ఇల్లు కిరాయికి తీసుకుని నివసిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తితో కొద్దిరోజుల క్రితం పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన వ్యక్తికి తవ్వకాల్లో గుప్త నిధులు లభించాయని, రూ.6 లక్షలకే కిలో చొప్పున బంగారాన్ని ఇప్పిస్తానని నమ్మించాడు. తాను పోలీసునని, అంతా చూసుకుంటానని చెప్పడంతో నమ్మిన సదరు వ్యక్తి.. రూ. 17 లక్షలకు పైగా ఇచ్చినట్లు తెలిసింది. రోజులు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో బాధితుడు 15 రోజుల క్రితం జిల్లా పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించాడు. దీంతో ఈనెల 6న డీఎస్పీ మదన్‌లాల్‌ను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేశారు. అంతే కాకుండా దేవునిపల్లి ఠాణాలో ఈ వ్యవహారంపై కేసు కూడా నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రాష్ట్ర అధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో డీఎస్పీ మదన్‌లాల్‌ను సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ఈ కేసులో డీఎస్పీతోపాటు మరో ఇద్దరు వ్యక్తుల పాత్ర ఉన్నట్లు తెలిసింది. దీనిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. సదరు డీఎస్పీ గతంలో పనిచేసిన చోట్ల కూడా ఫిర్యాదులు ఉన్నాయని సమాచారం. జిల్లాకు వచ్చిన తర్వాత కూడా మాయమాటలు చెప్పి చాలా మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లింగంపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



వడ్ల కుప్పల్లో నిలిచిన వర్షపు నీటిని తోడేస్తున్న రైతులు



భారీ వర్షం.. కొట్టుకు పోయిన ధాన్యం

నాగిరెడ్డిపేట మండలంలోని నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట్, చీనూర్, వెంకంపల్లి, లింగంపేట మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి, అయ్యపల్లి, పొల్కంపేట, కన్నాపూర్, మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి, బూర్గుల్, గున్కుల్, మహమ్మద్‌నగర్, నర్వ, హసన్‌పల్లి తదితర గ్రామాలలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం వర్షం నీటికి కొట్టుకుపోయింది. వరి కుప్పలలో నిలిచిన నీళ్లను తొలగించడానికి రైతులు నానా పాట్లు పడ్డారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



పొల్కంపేట కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పల చుట్టూ నిలిచిన వర్షం నీరు

క్లుప్తంగా

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



మోపాల్: పదోతరగతి సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని నిజామాబాద్ కేజీబీవీ, ముదక్‌పల్లి, కులాస్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంటగది, నిత్యావసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, ఏ మాత్రం లోపాలున్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల వద్ద విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని 10 జీపీఏ సాధించాలని, పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చెక్ పోస్టు వద్ద తనిఖీలు

రుద్రూర్: పోతంగల్ శివారులోని మంజీరా నది సమీపంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున రెవెన్యూ, ఎక్సైజ్, అగ్రికల్చర్, పోలీస్ సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి చెక్‌పోస్టును సందర్శించి పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు.

కూలిన డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ గోడ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్ నగర్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్ పూల్ గోడ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. ఏళ్ల క్రితం కట్టిన గోడ కావడంతో కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కాలువ ఇలా.. నీటి సరఫరా ఎలా?

- దుస్థితిలో నవాబు లిఫ్టు ప్రధాన కాలువ
- పేరుకుపోయిన పూడిక, మొక్కలు



నవాబు లిఫ్టు కాలువలో పెరిగిన మొక్కలు

వేల్పూర్: వేల్పూర్ మండలంలో నీటి సరఫరా జరిగే పడగల్ నవాబు చెరువు ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువలో పూడిక, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కాలువకు సిమెంటు లైనింగు ఉన్నప్పటికీ మొక్కలు ఏపుగా పెరిగి నీటి సరఫరాకు ఆటంకంగా నిలుస్తున్నాయి. పడగల్ నవాబు చెరువులోకి వేంపల్లి లిఫ్టు ద్వారా చేరే శ్రీరాంసాగర్ నీటితో ఈ ఎత్తిపోతల పథకం ఏర్పాటైంది. పడగల్, వేల్పూర్, అంక్సాపూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్, అమీనాపూర్, లక్కోర, సాహెబ్‌పేట్, మోర్తాడ్ మండలం దొన్కల్ గ్రామాలలో సుమారు 8 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అమీనాపూర్ గ్రామం వద్ద లిఫ్టు నీటికి డెలివరి పాయింటు ఏర్పాటు చేసి కాలవలకు లింకు కలిపారు. నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గతంలో సుమారు రూ. 12 కోట్లతో సిమెంటు లైనింగ్ చేయించారు.

సిమెంటు లైనింగ్ చేసి చాలా ఏళ్లు కావస్తుండడంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీనికి తోడు కాలువ పక్కల ఉన్న వ్యవసాయక్షేత్రాల రైతులు అక్కడక్కడ పంట భూముల చెత్తను కాలుల్లో పారవేయడం వల్ల కూడా చెత్తా చెదారం పేరుకుపోతోంది. ప్రస్తుతం ఖరీఫ్ పంటలు ముగుస్తున్నాయి. వచ్చే నెలలో రబీ పంటల సాగు మొదలవుతుంది. రబీ పంటల సాగు మొదలయిన కొద్ది రోజుల నుండి చెరువులు, చెక్‌డ్యాముల్లో నీటి నిల్వలు తగ్గుతూ వస్తాయి. చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిన కొద్దీ ఎత్తిపోతల పథకం ద్వారా వార బందీ ప్రకారం లిఫ్టుతో నీటిని చెరువులకు సరఫరా చేస్తారు.

దీంతో చెరువుల్లోకి చేరిన నీరు బోరుబావులకు భూగర్భజలాలు అందిస్తాయి.మరోవైపు ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో మరమ్మతు కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. గతంలో సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు ఎత్తిపోతల పథకాల వద్ద ఎటువంటి సమస్య ఏర్పడినా, కాలువల్లో పూడిక పేరుకుపోయినా వెంటనే చర్యలు చేపట్టేవారు. సాగునీటి సంఘాలను రద్దు చేసిన తర్వాత కాలువల గురించి పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం చర్యలు చేపట్టి కాలువల్లో పేరుకున్న పూడికను తీయంచాలని రైతులు కోరుతున్నారు.

పూడిక తొలగించాలి



వేల్పూర్ మండలంలో ఎనిమిది, మోర్తాడ్ మండలంలో ఒక గ్రామానికి నవాబు లిఫ్టు నీరు సరఫరా అవుతుంది. నవాబు లిఫ్టు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. పూడిక వల్ల నీటి సరఫరా సక్రమంగా జరుగదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూడిక తీయించాలి. – బద్దం రాజారెడ్డి, రైతు, వేల్పూర్

నీటి సంఘాలను పునరుద్ధరించాలి



గతంలో సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు ఎత్తిపోతల పథకాల నిర్వహణ, పూడికతీత వంటి పనులు చేపట్టేవి. దాంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండేవికావు. నీటి సంఘాలు ఏర్పాటు చేస్తే సాగు నీటి సరఫరా మెరుగుపడుతుంది.

– మిట్టపల్లి మహిపాల్, రైతు, అంక్సాపూర్

రాష్ట్రస్థాయి పోటీలకు స్నేహిత ఎంపిక



స్నేహితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని స్నేహిత ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గ్రౌండ్‌లో ఈ నెల 20న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో స్నేహిత ఉత్తమ ప్రతిభ చూపింది. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జోయిస్‌థామస్, మనోహర్‌రెడ్డి, ప్రకాశ్, సురేందర్ మంగళవారం తెలిపారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు.



మొక్కలు నాటుతున్న కూలీలు

మొక్కలు నాటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: మండలంలోని మెట్టుమర్రి తండా పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ అధికారులు మొక్కలను మంగళవారం నాటించారు. పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించి భూములను కబ్జా చేస్తున్నారని 'సాక్షి'లో ఈ నెల 21న 'అటవీ భూమి హంఫట్' అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు గతంలో నాటిన చెట్లను తొలగించి కబ్జా చేసిన భూమిలో మొక్కలను నాటించారు. చెట్లను తొలగించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ధాన్య భాండాగారంగా తెలంగాణ

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కంజర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశానికే ధాన్య భాండాగారంగా నిలిచిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మోపాల్, కులాస్‌పూర్, కంజర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, సొసైటీ చైర్మన్లు గ్యానాజీ గంగారెడ్డి, నిమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కంజర్‌లో 200 మెట్రిక్ టన్నుల గోదాము, కులాస్‌పూర్ తండాలో జీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మోపాల్, కులాస్‌పూర్‌లో రూ.20లక్షల చొప్పున ఆరోగ్య సబ్‌సెంటర్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని, సన్నరకాలను ప్రోత్సహించేందుకే రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని, త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు. మోపాల్‌లోనే రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అధికారం కోల్పోయిన కేటీఆర్, హరీశ్‌రావులు మతి తప్పి మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమాల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లోల సాయిరెడ్డి, ఆదివాసీ గిరిజన చైర్మన్ కెతావత్ యాదగిరి, ఫిషరీష్ చైర్మన్ పసూల శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, గొర్కంటి లింగన్న, వైస్ చైర్మన్లు రాజాకిషన్, తిరుపతి, గంగాప్రసాద్, ప్రతాప్‌సింగ్, కన్నీరాం, సతీశ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉదయ్, రాకేశ్, దిలావర్ హుస్సేన్, లక్ష్మారెడ్డి, గంగారెడ్డి, సాయన్న, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రసూల్‌బీ

నిజామాబాద్‌నాగారం: బాలల సంక్షేమం, బాల్య వివాహాలు, లైంగిక వేదింపులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. బాలల సంక్షేమంపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బాల రక్షభవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, తండాల్లో బాలల చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలపై లైంగిక వేదింపులు నిరోధించడానికి అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. పోలీస్ శాఖ నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని డీసీపీ బాసిత్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ సభ్యులు శోభారాణి రాజేంద్రప్రసాద్, ఆర్‌ఎంవో, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, డీసీపీవో చైతన్య, సఖి కోఆర్డినేటర్ భాను, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి బంగారు పతకం



లావణ్యను అభినందిస్తున్న సూపరింటెండెంట్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న లావణ్య బంగారు పతకం సాధించింది. ఫిబ్రవరిలో జరిగిన పరీక్షల్లో తెలంగాణ కేఎన్‌ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో ఈఎన్‌టీ సబ్జెక్టులో మొదటి స్థానాన్ని సాధించి బంగారు పతకం అందుకుంది. హైదరాబాద్‌లో జరిగిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సదస్సులో విద్యార్థిని లావణ్యకు ఈ నెల 20న పతకాన్ని అందించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ బంగారు పతకం జీజీహెచ్ విద్యార్థినికి రావడం గర్వంగా ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు. ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ హరీశ్ స్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

జానకంపేట్‌లో చోరీ

- ఇద్దరు నిందితుల అరెస్టు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట్‌లో సంతోష్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంతోష్ తన కుమార్తె అనారోగ్యానికి గురికావడంతో జీజీహెచ్‌కు మంగళవారం శస్త్రచికిత్స నిమిత్తం వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు చోరీకి యత్నిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ఎంబ సునీల్, అనపర్తి రవిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఈ చోరీలో నిందితులు వెండి, బంగారు ఉంగరం దొంగిలించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వైన్ షాప్, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



దోమకొండ: మండల కేంద్రంలోని వైన్ షాప్‌తో పాటు కల్లు దుకాణాలపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. లిక్కర్ స్టాక్, పర్మిట్ రూమ్, పరిసరాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ కూడా సంబంధిత అధికారుల నుంచి పొందారా లేదా అని పరిశీలించినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ తెలిపారు. అదేవిధంగా కల్లు దుకాణాలలో కూడా తనిఖీలు నిర్వహించి నమూనాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో ఎస్సై సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

దోమకొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరు కుమారులతో కలిసి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కుమారులు ఇద్దరు పాఠశాల నుంచి రాగానే తల్లి తన వెంట తీసుకెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బిచ్కుంద: మండలంలోని కందర్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.18,440 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మేనూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ శివారులో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై దాడిచేసినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 9,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం (బి)లో మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రాధికకు చెందిన గేదె గ్రామ శివారులోని శ్రీనిధి వెంచర్ వద్ద గడ్డిని మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ తీగ తెగిపడి ఉంది. గేదె విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా రూ.60వేల విలువగల గేదె మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గేదె స్థానంలో మనుషులు ఉంటే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు..



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఎర్రని దత్తయ్య మేకలు మంగళవారం కుక్కల దాడిలో మృతిచెందాయి. గొర్రెలను మేపడానికి తీసుకెళ్తున్న సమయంలో కుక్కలు దాడి చేయగా 8 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కూలి కోసం వచ్చి మృత్యు ఒడిలోకి..

- మోర్తాడ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఖమ్మం వాసి మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు

మోర్తాడ్: కూలీ పని కోసం వచ్చిన ఓ వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడవ గ్రామానికి చెందిన కాకర్ల గోవింద్(54) బతుకు దెరువు నిమిత్తం మోర్తాడ్‌కు సోమవారం రాత్రి భార్యతో కలిసి బస్సులో వచ్చాడు. కొద్దిసేపు అక్కడే ఉండి ఓ చెట్టు కిందికి చేరుకున్నారు. కొంత సేపటికి బయటకు వెళ్లిన గోవింద్ గాండ్లపేట్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా భర్త మృతదేహం వద్ద భార్య లక్ష్మి దీనంగా కూర్చుండడం అందరినీ కలిచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

మోర్తాడ్: మండలంలోని గాండ్లపేట్ శివారులో జాతీయ రహదారిపై వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం గాండ్లపేట్ శివారులో రక్తం కారుతూ ఉన్న వ్యక్తిని కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారని వెంటనే తాము ఘటన స్థలానికి చేరుకొన్నట్లు తెలిపారు. వెంటనే అతన్ని ఆర్మూర్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు. వ్యక్తికి గాయాలు ఎలా అయ్యాయో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659867, 8712659768 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

చెరువులో పడి మహిళ..

భిక్కనూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలోని కొత్తచెరువులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన జొర్రిగల దుర్గవ్వ(65)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. దీనికి తోడు ఆమె తరచూ ఫిట్స్‌తో బాధపడుతోంది. మంగళవారం ఇంటి నుంచి భిక్కనూరుకు వచ్చిన దుర్గవ్వ బస్టాండ్ సమీపంలో ఉన్న బొబ్బిలి చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. మృతదేహం నీటిలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా దుర్గవ్వ మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగు పడి కొడుకు మృతి.. తండ్రికి గాయాలు

నాగిరెడ్డిపేట: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామంలో పిడుగు పడి కొడుకు మృతి చెందగా, తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మంద నాగభూషణం, మంద వెంకటేశం (25) మంగళవారం గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఆరబెట్టేందుకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో అకాల వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లారు. చెట్టుపై పిడుగు పడటంతో వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందాడు. నాగభూషణంకు కాలికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్మూర్ మండలం అంకాపూర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంకాపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

అనారోగ్యంతో మరొకరు..

నస్రుల్లాబాద్: అనారోగ్యంతోబాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నస్రుల్లాబాద్ మండలం బొమ్మదేవ్‌పల్లిలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకట్‌రావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి గంగారాం(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో జడ్జి ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం పేర్కొన్నారు. నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో నిర్వహించగా మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన వంశీని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

ధర్పల్లిలో మరొకరికి..

ధర్పల్లి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబుడిన వ్యక్తికి జడ్జి రెండు రోజుల జైలు విధించినట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం పేర్కొన్నారు. ధర్పల్లి మండలానికి చెందిన కచ్చకాయల గంగాధర్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లింగంపేట: బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన లింగంపేట మండలంలోని మెంగారం శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కామారెడ్డిలో అడ్డ కూలీగా పనులు చేసుకొని రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సు శ్రీకాంత్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బడాభీమ్‌గల్‌లో..

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ శివారులో ఓ బైక్‌ను ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఓ పాఠశాల బస్సు విద్యార్థులను గొనుగొప్పులలో దింపి భీమ్‌గల్‌వైపు వస్తుండగా బడాభీమ్‌గల్ వద్ద బస్సు డ్రైవర్ జావిద్ అజాగ్రత్తతో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న తేలవత్‌రాజు, విఠల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన షేక్ జలాలుద్దీన్, నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన భూంపల్లి సంతోష్ అనే ఇద్దరు వడ్రంగి పనిచేసేవారు. తమ జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారన్నారు. లక్కోర శివారులో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానంతో తిరుగుతుండగా పట్టుబడ్డారన్నారు. చేసిన నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.